# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## కృష్ణకుమారి

### (సినిమా రంగం, 1955 ఏప్రిల్ నుంచీ పునర్ముద్రణ)



**నా మిత్రుడు బి.సదానందంగారు** నన్ను వెంకాజీ ఇంటికి పిలుచుకు వెళ్ళి నాకు ఆయనగారిని పరిచయం చేశారు. అప్పుడు వెంకాజీగారు చింతాద్రిపేటలో వుండేవారు. ఈయన పేపరు ఎక్స్పర్టు. ప్రభుత్వోద్యోగులలో ఒకరు. ఈయనగారితో పరిచయమైన తర్వాత నేను అప్పుడప్పుడు వారిని చూడ్డానికి వెళ్ళుతూ వుండేవాణ్ణి. ఒకరోజు వెంకాజీ లేని సమయాన ఆయన కుమారుడు రాముతో అవీ ఇవీ మాట్లాడుతూ కూర్చున్నాను. రాము నావద్ద కొన్ని సినిమా స్టిల్స్ వుండటం చూశారు. అవి 'సాయిబాబా' చిత్రం తాలూకు స్టిల్స్. వాటిలో జగన్నాధశర్మగారి స్టిల్ కూడా ఒకటివుంది. ఆ స్టిల్లును చూచి "ఈయనగారి దగ్గరే మా చెల్లెలు డ్యాన్సు నేర్చుకుంటూ వుంది" అని రాము అన్నారు.

'అలాగా' అన్నాను నేను. రాము అంతటితో ఊరుకోలేదు. జగన్నాధశర్మగారి స్టిల్స్ తీసుకుని లోపలికి వెళ్ళి కొద్ది నిమిషాలలో తిరిగివచ్చి "మా  సిస్టర్సుకు చూపెట్టి వచ్చానండి" అని అన్నారు.

ఇది నేను 'కంఠీరవ' నడుపుతున్న రోజుల్లో జరిగిన సంగతి. ఆ తర్వాత అంటే నాలుగేళ్ళకు నాకు వెంకాజీతో పరిచయం కలిగించిన మిత్రుడు మళ్ళీ అగుపడి 'కృష్ణకుమారి

ఇంటికి వెడదాం పద' అని పిలిచారు.

"కృష్ణకుమారి అంటే ఎవరు? సినిమా స్టార్ కృష్ణకుమారేనా?" అని నేను నా మిత్రుణ్ణి అడిగాను.

అందుకు నా మిత్రుడు “అవును” అన్నాడు.

"సినిమా స్టారుతో మీకెలా పరిచయం కుదిరింది?" ఆశ్చర్యపోతూ అడిగాను.

అందుకు నా మిత్రుడు నాకంటే ఆశ్చర్యపోతూ "కృష్ణకుమారి అంటే ఎవరనుకున్నారూ? మన వెంకాజీగారి కుమార్తేనండీ"అని అనేసరికి నా ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

జగన్నాధశర్మగారి వద్ద డ్యాన్స్ నేర్చుకున్న 'కృష్ణ ' ఈమే అయివుంటుందని, ఈమె అక్కగారే జానకి అని నేను అప్పుడు గ్రహించగలిగాను.

వెంకాజీగారి జేష్టపుత్రుడు రాము, ఆ తర్వాత జానకి, కృష్ణ పుట్టారు. 1935వ సంవత్సరం 6వతేదీన కృష్ణ నెహాటి (పశ్చిమ బెంగాల్)లో జన్మించింది. రాజమహేంద్రవరంలో ఐదవతరగతివరకు చదువుకుంది. తండ్రిగారు బీహారునుండి మద్రాసుకు బదిలీ అయిన తర్వాత కృష్ణకూడా మద్రాసు చేరుకుని ఇక్కడ ఆంధ్ర మహిళా సభలో చేరి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణురాలయింది.

కృష్ణకుమారి ఒకరోజు త్యాగరాయ నగర్ రాజకుమారి థియేటరుకు 'స్వప్నసుందరి ' చూడ్డానికి వెళ్ళింది. ఈమె ఈ థియేటరులో కాలుపెట్టిన వేళావిశేషం ఎలాంటిదో కానీ ఠకీమని ఈమెకు సినిమాలో నటించడానికి అవకాశం దానంతటదే వెదుక్కుంటూ వచ్చింది. ఆ రోజు ఆ థియేటరుకు తమిళనాడు టాకీస్ యజమాని సౌందర్‌రాజన్‌గారి కుమార్తె కూడా చిత్రం చూడ్డానికని వచ్చి కృష్ణకుమారిని చూసింది. తత్ఫలితంగా కృష్ణకుమారి 'నవ్వితే నవరత్నాలు'లో నటించగలిగింది.

కృష్ణ భరతనాట్యమేగాక వీణ వాయించడం కూడా నేర్చుకుంది. నాటకాలలో కూడా నటిస్తూ వుండేది.

ఈమె 'నవ్వితే నవరత్నాలు' చిత్రం తర్వాత జ్ఞానాంబికావారి 'మంత్రదండం'లో, నాగేశ్వరరావుతో నటించింది. ఈ చిత్రం తర్వాత కృష్ణకుమారి భారత్‌లక్ష్మివారి 'ప్రియురాలూ, ఏ.ఎస్ ప్రొడక్షన్స్ వారి 'ఆడబ్రతుకు'లోనూ ముక్కామలగారి 'మరదలు పెళ్ళి'లోనూ, ప్రతిభావారి 'చిన్నకోడలు'లోనూ జయమణివారి 'చిన్నమ్మ కథలోనూ నటించింది. ఈమె తెలుగేగాక కన్నడ తమిళభాషలుకూడా నేర్చుకోవడంచేత తమిళ కన్నడ చిత్రాలలో నటించడానికి అవకాశం లభించింది. ఈమె 'గుణసాగరి'లోనూ జూపిటర్ – లావణ్యావారి 'మనిదన్‌లోనూ, మాడరన్ థియేటర్స్‌వారి 'తిరుంబిపార్' చిత్రంలోనూ, జూపిటర్‌వారి 'అళగి'లోనూ, సాయిగానామృతవారి 'పుదుయుగం'లోనూ, కెంప్‌రాజ్ వారి 'కర్కోటై' చిత్రంలోనూ, నరుసూ వారి (తుళివిషం) 'రాజగురువు'లోనూ నటించింది. ఈమె నటించిన మరికొన్ని చిత్రాలు – నేషనల్

ఆర్టువారి 'పిచ్చి పుల్లయ్య ', సారధివారి 'అంతా మనవాళ్ళే', మ్యాయిరా ప్రొడక్షన్స్ వారి 'విడుదలై' (అరవం), శ్యామలా అండ్ యునైటెడ్ టెక్నీషియన్స్ వారి 'పల్లెపడుచు' వాహినీవారి 'బంగారుపాప '.

'బంగారుపాప'లో ఈమె నటన గురించి ప్రేక్షకులు ఇదివరకు ఏ చిత్రంలోనూ కృష్ణకుమారి ఇలా నటించలేదని ఈమెను మెచ్చుకుంటున్నారు. ఇక ముందు కూడా కృష్ణకుమారి ఇలాగే తెరపై తన ప్రతిభను చూపి ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరకొనగలదని ఆశిస్తున్నాను.

– *సినిమారంగం సంపాదకుడు*

Post your comments